వరినారు తుంచడంపై అవగాహన

రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయాధికారిణి దేవిక

జక్రాన్‌పల్లి, జూలై 15 : మండలంలోని మాదాపూర్ గ్రామంలో సోమవారం రైతులకు ముదిరిన వరి నారు కొనలు తుంచడంపై మండల వ్యవసాయాధికారిణి దేవిక క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. వరినారు తుంచడంతో మొగి పురుగు రాకుండా నివారణ చేయవచ్చన్నారు. రైతులు ఒకవేళ ముదిరిన నారు నాటితే తక్కువ దూరంతో ఎక్కువ నారును నాటాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారిణి సంధ్య, రైతులు పాల్గొన్నారు.

కాశీపురికి ఇంద్రపురి కోటి లింగాలు

సుభాష్‌నగర్, జూన్ 15: జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్ వాసవి రెసిడెన్సికి చెందిన 516 మంది మహిళలు నెలరోజులుగా శివదీక్షను చేపట్టి నాందేవ్‌వాడ ఛత్రపతి హనుమాన్ మందిరంలో కోటి మట్టి శివలింగాలను తయారు చేశారు. వీటికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి సోమవారం కాశీపురికి ప్రత్యేక వాహనంలో తరలించారు. ఈ సందర్భంగా శ్రీసాంబ సదాశివ మహాదేవ సేవాసమితి జిల్లా ప్రతినిధి అగమయ్యగుప్తా మాట్లాడుతూ..ప్రముఖ ధార్మికవేత్త డాక్టర్ షణ్ముఖ శర్మ సూచన మేరకు ఉమ్మడి జిల్లాలోని మహిళలు కోటి లింగాలను సిద్ధం చేశారని తెలిపారు. కాశీ క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేసి ఈనెల 21న నిమజ్జనం చేస్తారని ఆయన వివరించారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ధర్పల్లి, జూలై 15: యువకులు, విద్యార్థులు డ్రగ్స్, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై విక్రమ్ అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ కళాశాల, పాఠశాల విద్యార్థులకు పోలీసు కళాజాత బృందం ఆధ్వర్యంలో నాటికలు, పాటల ద్వారా మాదకద్రవ్యాలు, వ్యసనాల ద్వారా జరిగే అనర్థాలు ఏవిధంగా ఉంటాయో అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలకు అలవాటు పడితే భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. మహిళల భద్రత కోసం షీ టీం అండగా ఉంటుందని, అత్యవసర సమయంలో షీ టీం 8712659795, లేదా 100 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజేందర్ సాహెబ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పదవీ విరమణ చేసిన హోంగార్డుకు సన్మానం

ఉద్యోగ విరమణ చేసిన గంగారెడ్డిని సన్మానిస్తున్న సీపీ కల్మేశ్వర్

వినాయక్‌నగర్, జూలై 15: నిజామాబాద్ హోంగార్డు విభాగంలో విధులు నిర్వర్తించి సోమవారం ఉద్యోగ విరమణ చేసిన వి.గంగారెడ్డి(హెచ్‌జీ-83)ని సీపీ కల్మేశ్వర్ శాలువాతో సన్మానించారు. జ్ఞాపికను అందజేసి,వారి కుటుంబానికి పోలీసు శాఖ అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ(ఏఆర్) శంకర్ నాయక్, హోంగార్డు ఆర్ఐ సతీశ్, సిబ్బంది గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 91 ఫిర్యాదులు

త్వరగా పరిష్కరించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్లు, అధికారులు

కంఠేశ్వర్, జూలై 15 : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 91 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, డీపీవో తరుణ్ కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, ఏసీపీ రాజా వెంకట్ రెడ్డికి వినతులను అందజేశారు. ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యం ఇస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఆర్జీలను పెండింగ్‌లో ఉంచవద్దని సూచించారు. ప్రజావాణిలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రం తనిఖీ

కంఠేశ్వర్, జూలై 15: జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ వాటర్ ట్యాంక్ వద్ద కొనసాగుతున్న ప్రజాపాలన సేవా కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు సోమవారం తనిఖీ చేశారు. ఆరు గ్యారెంటీల అమలుకోసం ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నది. వివిధ కారణాలతో ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పొందలేని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవడానికి ప్రజాపాలన సేవా కేంద్రాలను కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో కలెక్టర్ సేవా కేంద్రాన్ని సందర్శించి దరఖాస్తులు పరిష్కరిస్తున్న తీరును పరిశీలించారు. దరఖాస్తుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లోపాలను సవరించి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఈ-సేవ డిస్ట్రిక్ట్ మేనేజర్ కార్తిక్ తదితరులు ఉన్నారు.

ఆపరేటర్ నంబర్ మార్చండి సార్లూ..

మున్సిపల్ పరిధిలో ఐదు ప్రజాపాలన కేంద్రాల్లో ఆపరేటర్ ఫోన్ నంబర్ ఏర్పాటు చేశారు. అధికారుల తప్పిదంతో కంఠేశ్వర్ వాటర్ ట్యాంక్ ఆపరేటర్ నంబర్‌కు బదులుగా బస్వరాజు అనే వ్యక్తి నంబర్ ఇచ్చారు. దీంతో సదరు వ్యక్తి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నానని, నిత్యం సుమారు తన నంబర్‌కు 70 కాల్స్ వరకు వస్తున్నాయని వాపోయాడు. అధికారులు వెంటనే నంబర్ మార్చాలని కోరుతున్నాడు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ

యాద్గార్‌పూర్‌లో మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో

కోటగిరి, జూలై 15: వన మహోత్సవంలో భాగంగా మండలంలోని యాద్గార్‌పూర్‌లో ఎంపీడీవో మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు. సోమవారం ఆయన యాద్గార్‌పూర్ గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రతి ఇంటి ఆవరణలో ఆరు మొక్కలు నాటాలని సూచించారు. చెట్లతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సునంద, ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్, జాకీర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లిలో..

ధర్పల్లి, జూలై 15 : మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సైపుద్దీన్,, ఎంపీడీవో బాలకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. మండలంలో బుధవారం వన మహోత్సవ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ బాలు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నడిపల్లిలో..

డిచ్‌పల్లి, జూలై 15: మండలంలోని నడిపల్లి గ్రామంలో సోమవారం వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ మూడు చొప్పున మొత్తం 1748 ఇండ్లకు మూడు మొక్కలను పంపిణీ చేశారు. మొక్కల సంరక్షణ బాధ్యత ఇంటి యజమానులదే అని గ్రామ కార్యదర్శి కిషన్‌రావు తెలిపారు. ప్రతి ఇంటి వద్ద మూడు మొక్కలని తప్పని సరిగా పెంచుకోవాలని సూచించారు.

- **ముగిసిన నవరాత్రి ఉత్సవాలు:** సుభాష్‌నగర్, జూన్ 15: జిల్లా కేంద్రంలోని కోటగల్లి బంగారు మైసమ్మ ఆలయంలో తొమ్మిదిరోజులుగా కొనసాగుతున్న వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు సోమవారం ముగిశాయి. ముగింపు వేడుకలకు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీఅధ్యక్షుడు దేవేందర్, కన్వీనర్ ధర్మపురి కార్తిక్, హరీశ్‌రెడ్డి, ఆనంద్, రాకేశ్, మహిళలు పాల్గొన్నారు.
- **ప్రిన్సిపాల్‌కు ఘన సన్మానం:** డిచ్‌పల్లి జూలై 15: రూరల్ నియోజకవర్గంలోని ధర్మారం పాఠశాలలో ఆరేండ్లుగా విద్యాబోధన, సేవలు అందించిన ప్రిన్సిపాల్ సంగీత, విక్టోరియాను విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ఘనంగా సన్మానించారు. తెలంగాణ గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు నక్క రాజేందర్, నర్సయ్య, శ్రీనివాస్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.
- **సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి:** సిరికొండ, జూలై 15: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి అరవింద్ అన్నారు. మండలంలోని సత్యశోధక్ పాఠశాలలో సీజనల్ వ్యాధులు-నివారణచర్యలు అనే అంశంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చికిత్సకన్నా నివారణ ముఖ్యమని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ నర్సయ్య, సిబ్బంది పాల్గొన్నారు.
- **సులేమాన్ నగర్‌లో:** రుద్రూర్, జూలై 15: మండలంలోని సులేమాన్‌నగర్‌లోని ఉర్దూ పాఠశాలలో సోమవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. హెచ్‌ఈవో గోవర్ధన్, ఏఎన్‌ఎం అనంతలక్ష్మి, ఆశ, టీచర్లు పాల్గొన్నారు.
- **ఘనంగా జాతీయ నైపుణ్య దినోత్సవం:** జక్రాన్‌పల్లి, జూలై 15 : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం జాతీయ నైపుణ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. మానవ మనుగడకు నైపుణ్యాలు ఎంతో ముఖ్యమైనవని; మన జీవన ప్రమాణాల ఎదుగుదలకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. పదో తరగతి విద్యార్థులు తయారుచేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.
- **సీనయ్యకు జాతీయ అవార్డు:** ఖలీల్‌వాడి, జూలై 15: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవాలనే ఉద్దేశంలో బహుజన సాహిత్య అకాడమీ ప్రతి ఏటా జాతీయ అవార్డులను అందజేస్తోంది. ఈ సంవత్సరం నిజామాబాద్‌కు చెందిన జూనియర్ లైన్‌మన్ ఏఈ ఆపరేషన్ డి-2లో పనిచేస్తున్న గోర్ల సీనయ్యకు జాతీయ అవార్డును ప్రకటించారు. ఈ అవార్డును ఏపీలోని తిరుపతిలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సీనయ్యకు అందజేశారు.
- **ఇంటిగ్రేటెడ్ పీజీ పరీక్షలు ప్రారంభం:** డిచ్‌పల్లి, జూలై 15: తెలంగాణ యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ పీజీ సెమిస్టర్ బ్యాగ్ లాగ్ పరీక్షలు ప్రారంభమైనట్లు ఆడిట్‌సెట్ డైరెక్టర్ ఆచార్య గంటా చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ట్స్ అండ్ సైన్స్, న్యాయ కళాశాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయగా, ఉదయం 104 మంది విద్యార్థులకు 98 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 246 మందికి 237 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

'ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థులే అధికారం చెలాయిస్తున్నారు..'

రాష్ట్ర విత్తన అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా అన్వేశ్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. - కంఠేశ్వర్, జూలై 15

వినాయక్‌నగర్, జూలై 15: నియోజకవర్గాల్లో గెలిచిన ఎమ్మెల్యేల కన్నా ఓడిపోయిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అధికారం చెలాయిస్తున్నారని బీజేపీ నాయకులు మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాలులో బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్, జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డే మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ అభివృద్ధికి ఆటంకాలు సృష్టిస్తున్నారని, దీనిని సహించేదిలేదన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు పల్లె గంగారెడ్డి, లోక భూపతిరెడ్డి,వెంకట్ రమణి, మల్లికార్జున్ రెడ్డి, పోతన్‌కార్ లక్ష్మీనారాయణ, న్యాలంరాజు, స్రవంతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యాసంస్థలను తనిఖీ చేస్తాం..

- **పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల శుభ్రత తప్పనిసరి**
- **నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్**

కంఠేశ్వర్, జూలై 15 : పారిశుద్ధ్య నిర్వహణ, పరిశుభ్రతపై విద్యాసంస్థలు కచ్చితంగా నిబంధనలు పాటించాలని నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్ సూచించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని విద్యాసంస్థల్లో పారిశుద్ధ్య నిర్వహణపై తనిఖీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై విద్యాసంస్థలకు పలు సూచనలు చేశారు. బాల బాలికల కోసం వేర్వేరుగా మరుగుదొడ్లు ఏర్పాటు చేసి తగినంత నీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. పాఠశాల ఆవరణలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూడాలన్నారు. తడి, పొడి డబ్బాల్లో చెత్తను సేకరించి మున్సిపల్ వాహనాలకు అప్పగించాలని సూచించారు. మున్సిపాలిటీ చట్టం ప్రకారం అన్ని విద్యాసంస్థల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు శానిటేషన్ ఎన్‌వోసీ తప్పనిసరిగా పొందాలని ఆయన ఆదేశించారు.

'వీఆర్‌ఏల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా'

భీమ్‌గల్, జూలై 15: బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించేలా కృషి చేయాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీకి హాజరైన మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి నియోజకవర్గంలోని వీఆర్ఏలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భగాం మాట్లాడుతూ తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. వేముల మాట్లాడుతూ రానున్న అసెంబ్లి సమావేశాల్లో వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

ఎస్సారెస్పీలోకి స్వల్ప ఇన్‌ఫ్లో

మోర్తాడ్, జూలై15: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి స్వల్పంగా ఇన్‌ఫ్లో పెరిగింది. ఆదివారం ప్రాజెక్టులోకి 3183 క్యూసెక్కులు, సోమవారం 3831క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా, ఆదివారం నాటికి 1062.50 అడుగుల(13.078టీఎంసీల) నీరు ఉంది. 494 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతోంది. సరస్వతీ కాలువకు పది, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. 253 క్యూసెక్కుల నీరు ఎండవేడికి ఆవిరి అవుతోంది. జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 7.381 టీఎంసీల నీరు ప్రాజెక్ట్‌లోకి వచ్చి చేరింది.

కేజీబీవీ పరిశీలన

బాలికలతో మాట్లాడుతున్న ఎస్‌జేడబ్ల్యూహెచ్‌ఆర్‌సీ సభ్యులు

ఏర్గట్ల, జూలై 15: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) ఎస్‌జేడబ్ల్యూహెచ్‌ఆర్‌సీ జిల్లా డైరెక్టర్ కట్కం సామంత్ రెడ్డి, అర్మూర్ నియోజకర్గ చైర్మన్ కైరి నరేశ్‌గౌడ్ సోమవారం సందర్శించారు. పాఠశాలలో బాలికలతో మాట్లాడి సమస్యల అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలికలతో కలిసి భోజనం చేశారు. వారు మాట్లాడుతూ.. పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలుస్తోందని ఉపాధ్యాయునిలు వీణ, లలిత తమ దృష్టికి తీసుకువచ్చారని, విషయన్ని సంబంధిత జిల్లా అధికారుల దృష్టికి తీసుకళ్తామని అన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలి

మాట్లాడుతున్న బండారు మల్లేశ్

శక్కర్‌నగర్, జూలై 15: ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా బోధన డివిజన్ సహాయ కార్యదర్శి బండారు మల్లేశ్ డిమాండ్ చేశారు. సోమవారం బోధన్ పట్టణంలోని పాన్‌గల్లీ హెడ్‌పోస్టాఫీస్ వద్ద ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ పలు వాగ్దానాలు చేసిందని, రేవంత్‌రెడ్డి సీఎంగా అధికారం చేపట్టి ఏడు నెలలు గడుస్తున్నా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ తెల్లరేషన్ కార్డులు అందజేయాలని, కొత్త రుణాలు అందజేయాలని కోరారు. వ్యవసాయ కార్మికులకు రూ. 12వేలు జీవనభృతిని అమలు చేయాలని కోరారు. హామీలు అమలు చేయకుంటే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

వివాదాస్పద స్థలం పరిశీలన

స్థానికులతో మాట్లాడుతున్న ఏసీపీ బస్వారెడ్డి

ఆర్మూర్‌టౌన్, జూలై15: ఆర్మూర్ మండలంలోని చేపూర్ గ్రామంలో వివాదాస్పదంగా మారిన శ్మశాన వాటిక స్థలాన్ని సోమవారం ఏసీపీ బస్వారెడ్డి సిబ్బందితో కలిసి పరిశీలించారు. 30 ఏండ్ల నుంచి శ్మశాన వాటిక స్థలం కోసం ఆందోళన చేపడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులతో ఏసీపీ మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. గ్రామంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వర్షం నీరు నిలిచి ఉండకుండా చూసుకోవాలి

అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్

ఆర్మూర్‌టౌన్, జూలై15: పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ రామమందిర్ పాఠశాలలో సోమవారం సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగీ, ఫైలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంటే దోమల వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతాయని అన్నారు. నీరు నిలిచి ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి రక్షించాలి

నందిపేట్‌లో మొక్కను నాటుతున్న రాకేశ్‌రెడ్డి

నందిపేట్, జూలై 15: ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని, భవిష్యత్తు తరాలకు చెట్లు ఎంతో మేలు చేస్తాయని, బాధ్యతగా మొక్కలను నాటాలని ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి అన్నారు. నందిపేట్, డొంకేశ్వర్ మండలాలకు చెందిన 102 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సోమవారం మండలకేంద్రంలో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే మొక్కను నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు బూతం సాయారెడ్డి, నాయకులు పేంటర్ రాజు, ఆరుట్ల రమేశ్, కుమ్మరి చిన్నయ్య, గాండ్ల నర్సాగౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు

విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న సిబ్బంది

ముప్కాల్, జూలై15: భారత్ పెట్రోలియం సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛత పక్వాడ్-2024 ముగింపు సందర్భంగా మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో వినోద, భరత్ పెట్రోలియం సిబ్బంది ఉదయ్‌కిరణ్, మునాపతి బన్ని, డి.శ్రీనివాస్, క్రాంతి పాల్గొన్నారు.

కూలీలకు బకాయిలు డబ్బులు చెల్లించాలి

నందిపేట్, జూలై 15: 4-5 వారాల కూలీ డబ్బులు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సోమవారం ఉపాధి హామీ కూలీలు, వనసేవకులు ఏఐపీకేఎంఎస్ ఆధ్వర్యంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. బకాయిలు వెంటనే ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐపీకేఎంఎస్ నాయకులు నాయకులు దేవన్న, గంగాధర్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు తూంపల్లి క్రీడాకారులు

సిరికొండ, జూలై15: హైదరాబాద్‌లోని గచ్చిబౌలీ హాకీ స్టేడియంలో తెలంగాణ హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 30న నిర్వహించిన పోటీల్లో తూంపల్లి గ్రామానికి చెందిన జశ్విత, విశాల్, లోకేష్ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సబ్ జూనియర్ సౌత్ జోన్ జాతీయ స్థాయి హాకీ పోటీలు ఈనెల 19 నుంచి కేరళ రాష్ట్రంలో నిర్వహించనున్నారని పీఈటీ నాగేశ్ తెలిపారు. జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన వారిని హెచ్ఎం రాములు, పాఠశాల సిబ్బంది, వీడీసీ సభ్యులు సోమవారం అభినందించారు.

వారంలోగా పనులు పూర్తి చేయాలి

వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీవో శ్రీనివాస్

రెంజల్, జూలై 15: రెండో విడుతలో ఎంపికైన అమ్మ ఆదర్శ పాఠశాలలో మిగిలిన పనులను వారంలోగా పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ గుత్తేదార్‌ను ఆదేశించారు. మండలంలోని వీరన్నగుట్ట ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను ఎంపీడీవో శ్రీనివాస్, పీఆర్ డీఈ రాజయ్యతో కలిసి పరిశీలించారు. పనులను దగ్గరుండి పూర్తి చేయించాలని ఏఈ వినయ్‌కుమార్‌కు సూచించారు. అంతకు ముందు సాటాపూర్‌లో పల్లె ప్రకృతివనం, నర్సరీని పరిశీలించినట్లు ఎంపీడీవో తెలిపారు. ఆయన వెంట ఏపీవో రమణ, కార్యదర్శి మహిబూబ్‌ఆలీ, హెచ్ఎంలు ఈశ్వర్, లాస్య, ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న హెచ్ఎంకు సన్మానం

ముప్కాల్, జూలై 15: వేంపల్లి గ్రామంలో 11 ఏండ్లుగా ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న సాంబార్ లక్ష్మీనారాయణను గ్రామస్తులు సోమవారం సన్మానించారు. పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ రామకృష్ణ యాదవ్, మాజీ సర్పంచ్ అంజయ్య, మాజీ చైర్మన్ పిప్పెర గణేశ్, సుమన్, హెచ్ఎం శైవ శ్రీనివాస్, జీపీ కార్యదరి రాజ్యలక్ష్మి వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

పెద్దచెరువు శిఖంను కాపాడాలి

వినతిపత్రం అందజేస్తున్న వీడీసీ సభ్యులు

బాల్కొండ, జూలై 15: పెద్దచెరువు శిఖంను కబ్జా నుంచి కాపాడాలని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. చెరువును కబ్జాదారుల నుంచి కాపాడి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయలేదని, సర్వేయర్‌తో సర్వే చేపట్టి చెరువును రక్షించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుర్తింపు లేని ప్రైవేట్ పాఠశాలలకు మెమో

బాల్కొండ, జూలై 15: గుర్తింపు లేని ప్రైవేట్ పాఠశాలలకు మెమో జారీ చేసినట్లు మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కిసాన్‌నగర్ ప్రైవేట్ పాఠశాలలో నర్సరీకి గుర్తింపు లేనందున షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు మెమో జారీ చేశామన్నారు. గుర్తింపు లేకుండా నడుపుతున్న పాఠశాలల మూసివేయాలని పేర్కొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరోజు జైలుశిక్